సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 17 । జూన్ । 2025



బస్సు పాసులు పొందండిలా..!
పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు బస్సు పాసుల జారీకి ఆర్టీసీ డిపో అధికారులు చర్యలు చేపట్టారు. -8లో



రియల్టర్ దారుణ హత్య
మదనపల్లెలోని బసినికొండ పంచాయతీలో జాతీయరహదారికి ఆనుకుని బైపాస్‌రోడ్డులో రియల్టర్, వడ్డీ వ్యాపారి నారప్పగారి గంగాధర హత్యకు గురయ్యాడు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.220
రెండోరకం	రూ.120	రూ.170

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1780 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం
రాయచోటి జగదాంబసెంటర్: జిల్లా కలెక్టర్ ఉత్తర్వుల మేరకు 2026 పద్మా అవార్డులైన పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీల కోసం 'సామాజిక సేవా'రంగాల్లో అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సి.సాయి గ్రేస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు స్టెప్ మేనేజర్ వీవీ సుబ్బరాయుడు 9949298810, జూనియర్ అసిస్టెంట్ వీవీ నారాయణ 9849497045 నంబర్లలో సంప్రదించాలని తెలియజేశారు.

21నుంచి పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్
రాయచోటి టౌన్: పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్ ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.శివశంకర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలిసెట్ ప్రవేశపరీక్షలో అర్హత సాధించిన వారు డిప్లమా కోర్సులో ప్రవేశం కోసం కౌన్సెలింగ్‌కు ర్యాంక్‌లవారీగా హాజరు కావాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం పాలిసెట్ కౌన్సెలింగ్ ఇన్‌చార్జి ఎం. రవిశంకర్‌ను 97042007887 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

యువత అగ్నివీర్‌ను సద్వినియోగం చేసుకోవాలి
రాయచోటి: యువత అగ్నివీర్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. భారత వైమానిక దళానికి చెందిన కార్పొరల్ సందీప్, కార్పొరల్ సురేంధర్ సింగ్‌లు సోమవారం కలెక్టర్‌ను కలిసి వివిధ విషయాలపై చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ భారతదేశ వైమానిక దళం చేస్తున్న సేవలు అనిర్వచనీయమని, భారత్–పాకిస్తాన్ యుద్ధసమయంలో కీలక పాత్ర పోషించిందని అన్నారు.యువత పెద్ద సంఖ్యలో అగ్నివీర్‌లో చేరే విధంగా చర్యలు చేపట్టాలని భారతదేశ వైమానిక దళానికి చెందిన ఆఫీసర్లకు సూచించారు.అంతకుముందు రాయచోటిలోని సాయి ఇంజినీరింగ్ కళాశాల, రాజు కళాశాలలో అగ్నివీర్ వాయు కార్యక్రమంపై భారతదేశ వైమానిక దళం అవగాహన కార్యక్రమం నిర్వహించింది.


డీటీ, మాజీ వీఆర్వో ఇళ్లపై రెవెన్యూ దాడులు
రాయచోటి: రాయచోటిలో డిప్యూటీ తహసిల్దార్, అతని అసిస్టెంట్, మాజీ వీఆర్వో ఇళ్లపైన రెవెన్యూ పోలీస్ శాఖలు సంయుక్తంగా ఏకకాలంలో దాడులు చేశాయి. సోమవారం సాయంత్రం జిల్లా రెవెన్యూ అధికారులు రాయచోటి అర్బన్ పోలీసులు ఆధ్వర్యంలో ఈ దాడులు కొనసాగాయి. కె.వి పల్లి మండల డిప్యూటీ తహసిల్దారుగా పని చేస్తున్న యూనిత్ రెడ్డి గతంలో రాయచోటి తహసిల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన కాలంలో రికార్డులను కనిపించకుండా చేశాడన్న సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించినట్లు సమాచారం. ముఖ్యంగా కార్యాలయంలోని డీకేటీ రిజిస్టర్లు, మిస్త్రీ పట్టాల రిజిస్టర్లు, చుక్కల భూముల రికార్డులు మాయం కావడంపై ఫిర్యాదులు రావడంతో జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఆదేశాల మేరకు యూనిత్‌రెడ్డి, అతని అనుచరుడు ఖాదర్‌వలీ అలియాస్ (చోటు), సిబ్యాల గ్రామ మాజీ వీఆర్‌ఓ స్వామి ఇళ్లపైన ఏకకాలంలో దాడులు చేశారు. ఈ దాడులలో రాయచోటి పట్టణంలోని డిటి యూనిత్‌రెడ్డి, అతను అనుచరుని ఇంటిలో ఎలాంటి రికార్డ్స్ లేకపోవడంతో అధికారులు పోలీసులు వెను తిరిగి వెళ్లినట్లు సమాచారం. సిబ్యాల మాజీ వీఆర్‌ఓ ఇంటిలో రెవెన్యూ రికార్డులు, సీల్లు, గ్రామ మ్యాపులు, రికార్డుల తయారీకి అవసరమైన సామగ్రి ఉన్నట్లు గుర్తించారు. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులలో రాయచోటి అర్బన్ సీఐ బి.వి చలపతి, తహసిల్దార్ నరసింహా కుమార్, ఎస్సై పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

నేల తల్లికి గర్భశోకం!

- జిల్లాలో యథేచ్ఛగా సహజ వనరుల దోపిడీ
- పెన్నా నది నుంచి సరిహద్దులు దాటిపోతున్న ఇసుక
- చెరువులు, గుట్టల్లో మట్టి తవ్వకాలు
- చిన్నపాటి గనుల్లోనూ తమ్ముళ్లదే హవా
- అధికారులకు తెలిసినా.. చూసీచూడనట్లు పోతున్న వైనం



మదనపల్లె పరిధి అంకిశెట్టిపల్లె వద్ద మట్టిని తరలించడంతో కొండ ప్రాంతానికి ఏర్పడిన గోతులు



సాక్షి రాయచోటి: జిల్లాలో అధికారం అండగా తెలుగు తమ్ముళ్లు ఆర్థికంగా బలపడటం కోసం అన్ని దారులు వెతుకుతున్నారు. ఇప్పటికే భూములు, మద్యం ఇలా అన్నింటినీ చెరబట్టారు. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ ఉన్న కాడికి సర్దుతున్నారు. ఇదే కోవలో మట్టిలోనూ తైలం తీసి కాసులు తీస్తున్నారు. జిల్లాలో అధికార పార్టీ నేతల కనుసన్నల్లో యథేచ్ఛగా చెరువులు, కుంటల్లోని మట్టి తరలిపోతోంది. ఇదేమని అడిగే అధికారులు లేకపోగా... మనకెవరూ అడ్డు అనుకుంటూ మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్క మట్టిలోనే కాకుండా ఇసుకను సరిహద్దులు దాటిస్తున్నారు. మైనింగ్‌కు సంబంధించి చిన్నపాటి క్వారీ యజమానులను కప్పం కట్టాలని భయపెడుతున్నారు. సహజ వనరులను కూడా దోపిడీ చేస్తున్నారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎక్కడికక్కడ తవ్వకాలు సాగిపోతుండడంతో నేలతల్లికి గర్భశోకం తప్పడం లేదు.

సరిహద్దులు దాటుతున్న ఇసుక
జిల్లాలో ఇసుక సరిహద్దులు దాటుతోంది. అధికారికంగా ఉన్న ఇసుక డిపోల వద్ద పగలు తీసుకెళ్లడం, రాత్రి సమయాల్లో చెయ్యేరును చెరపట్టడం జరుగుతోంది. అటు రైల్వేకోడూరు–రాజంపేట పరిధిలోని చెయ్యేరులో రాత్రిళ్లు టిప్పర్లతో ఇసుకను తోడేస్తున్నారు. మరోవైపు బుడుగుంటపల్లె వద్ద ఏకంగా చెయ్యేరు నదిలోనే రోడ్డు నిర్మించి ఇసుకను తరలిస్తున్నారు. అధికారుల కన్నుగప్పి జిల్లాలో పలుచోట్ల రాత్రి మొదలుపెట్టి తెల్లవారుజాములోపు ఇసుక టిప్పర్లను కంటికి కనిపించకుండా పంపిస్తున్నారు. పగలు అధికారికంగా ఎక్కడా అక్రమాలకు తావు లేనట్లుగా తోలడం, తర్వాత ఇసుకను బయటి ప్రాంతాలకు పంపుతుండడం ఆందోళన కలిగించే పరిణామం. ప్రతిరోజు రామసముద్రం ప్రాంతంలో చెరువుల నుంచి ఇసుకను బెంగళూరుకు తరలిస్తున్నారు. కలికిరి, చెయ్యేరు, బహుదా, గుర్రంకొండ వద్దగల చెరువు నుంచి ఇలా అన్నిచోట్ల ఇసుకను తమ్ముళ్లు తరలిస్తూ సొమ్ము చేసుకుని ఆర్థికంగా బలపడుతున్నారు.

మైనింగ్‌పై మాఫియా
జిల్లాలో ఉన్న మైనింగ్‌పై కూడా మాఫియా వాలుతోంది. అధికార కూటమి సర్కార్‌లోని కొంతమంది చిన్నపాటి క్వారీ యజమానులకు ఫోన్ చేసి సొమ్ములు పంపించాలని కోరుతున్నారు. లేకపోతే క్వారీలను అప్పగించాలని నయానో భయానో హెచ్చరిస్తున్నారు. తంబళ్లపల్లె, మదనపల్లె ప్రాంతంలో క్వారీలకు సంబంధించి తమ్ముళ్లు ఆధీనంలోకి తీసుకునేందుకు యత్నాలు సాగిస్తున్నారు. మంగంపేటలోనూ అవసరమైన మేరకు కూటమి నేతలు తమకు అనకూలంగా పనులు చేయించుకునేందుకు పావులు కదుపుతున్నారు. ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ గ్రానైట్, ముగ్గురాయి, ఇతర వ్యవహారాల్లోనూ తలదూర్చుతూ కప్పం రాబట్టుకునేందుకు పాట్లు పడుతున్నారు. ఇప్పటికే ఇసుక, మద్యం, మట్టిని చెరబట్టిన తమ్ముళ్లు మైనింగ్‌పై కూడా కన్నేసి దోపిడీ చేసేందుకు పథకం అమలు చేస్తున్నారు.

- జిల్లాలో రియల్ ఎస్టేట్‌కు సంబంధించి వేసే వెంచర్లకు మట్టి అవసరం అవుతుంది. దానిని కూడా తెలుగు తమ్ముళ్లు అవకాశంగా మలుచుకుని రియల్టర్లు నుంచి ఎంతోకొంత వసూలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్నిచోట్ల ఈ తంతు కొనసాగుతున్నట్లు సమాచారం. వెంచర్లు వేసే సమయంలో ఎక్కడికక్కడ రోడ్లకు మట్టి తరలింపు అవసరం. కొన్నిచోట్ల గ్రావెల్, మరికొన్నిచోట్ల మట్టిని తరలిస్తున్నారు. వెంచర్లకు అవసరమయ్యే మట్టిని కూడా కూటమి నేతలు గుంపగుత్తగా మాట్లాడుకుని మట్టి తోలుతూ వెనకేసుకోవడం పరిపాటిగా మారింది.

జోరుగా మట్టి తవ్వకాలు
జిల్లాలో ప్రతిరోజు మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. కొండలు, గుట్టలను తొలిచేస్తున్నారు. అధికారుల వద్ద అనుమతులు అంతంతమాత్రంగా తీసుకుని ఊడ్చేస్తున్నారు. జిల్లాలో ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో మట్టితవ్వకాలు సాగిపోతున్నాయి. మదనపల్లె పరిధిలోని అవిశెట్టిపల్లె, రాచనేటివారిపల్లె, వేంపల్లెతోపాటు తంబళ్లపల్లె, రాజంపేట, పీలేరు నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి. గుట్టలు తొలచడం, చెరువుల్లోని మట్టిని ప్రతిరోజు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు కూడా చూసీచడనట్లు పోతుండడంతో అక్రమ వ్యవహారాలు అలా సాగిపోతున్నాయి.



మదనపల్లె టౌన్ బీకే పల్లె వద్ద మట్టి తరలింపు (ఫైల్)

అర్జీలకు సత్వర పరిష్కారం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్

రాయచోటి: ప్రజల నుంచి అందిన అర్జీలను నిర్లక్ష్యం చూడపకుండా సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ మధుసూదన్‌రావు, ఆర్డీఓ శ్రీనివాస్, ఎస్‌డీసీ రాఘవేంద్ర, గిరిజన సంక్షేమ అధికారి తేజశ్విని పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి
ప్రజా సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని, బాధితులకు న్యాయం చేయాలని జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని అదనపు ఎస్పీ వెంకటాద్రి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఇన్‌చార్జి ఎస్పీ ఇ.జి.అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.

జిల్లా పంచాయతీ అధికారిగా రాధమ్మ
రాయచోటి: అన్నమయ్య జిల్లా పంచాయతీ అధికారిగా ఎ.రాధమ్మ బాధ్యతలు చేపట్టారు. సోమవారం జిల్లా పంచాయతీ కార్యాలయంలో ఆమె బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా కలెక్టర్ శ్రీధర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

బాధ్యతల స్వీకరణ
ఓబులవారిపల్లె: ఆంధ్రప్రదేశ్ ఖనిజాభివృద్ధి సంస్థ మంగంపేట చీఫ్ ప్రాజెక్టు ఆఫీసర్‌గా గోపీనాథ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ సీపీఓగా బాధ్యతలు నిర్వహించిన సుదర్శన్ రెడ్డి ఎంబీసీ విజయవాడ కేంద్రం కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. గోపీనాథ్‌కు ఏపీఎండీసీ ఉద్యోగులు, గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు.

గృహనిర్మాణ శాఖలో రిటైర్డ్ ఉద్యోగులకు మళ్లీ ఉద్యోగాలు

- పునరావాస కేంద్రంగా మార్చేస్తున్నారని విమర్శలు



మదనపల్లె: గృహనిర్మాణశాఖలో ఇప్పటికే గందరగోళ పరిస్థితి నెలకొంది. దీనికితోడు ప్రభుత్వం రిటైర్డ్ అధికారులు, ఉద్యోగులకు మళ్లీ ఉద్యోగ అవకాశం కల్పించేందుకు సిద్ధమైంది. దీనికి సంబంధించి వివరాలు పంపాలని ఆశాఖ ఎండీ ఎం.శివ ప్రసాద్ ఈనెల 11న ఉత్తర్వు జారీ చేశారు. దీంతో ఆ శాఖలో అలజడి మొదలైంది. ఇప్పటికే ఉన్న అధికారులు, ఉద్యోగుల్లో కొంతమందిపై ఆర్థిక ఆరోపణలు, విద్యార్హతలపై వివాదాలు నెలకొన్నాయి. దీనిపై ఇటీవల ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ పరిస్థితుల్లో జారీ అయిన ఉత్తర్వులపై వివాదం రాజుకునే పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణాల పర్యవేక్షణ, పనులు పూర్తి చేయించడం కోసం సాంకేతిక, సాధారణ అధికారుల నుంచి గుర్తించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఇప్పటికే గృహనిర్మాణశాఖలో ఉద్యోగ విరమణ చేసిన వారి వివరాలు, హోదా, అప్పటికి వేతనం, వివాదాలు, ఆరోపణలు, పనిచేసిన ప్రాంతం, వారి పేర్లు, శాఖాపరంగా వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు.. క్రమశిక్షణ చర్యలు పెండింగ్‌లో ఉన్నాయా తదితర వివరాలతో పాటు ఆయా ప్రాంతాల్లో ఖాళీల స్థితి, అవసరమైన పోస్టుల సంఖ్య వివరాలను ఈనెల 16నాటికి నివేదించాలని జిల్లాల ప్రాజెక్టు డైరెక్టర్లకు సూచించారు. ఇప్పటికే రిటైర్ అయిన వారిలో చాలా మంది వివిధ ఆరోపణలు, విచారణలు, ఎదుర్కొంటున్న వారే ఉన్నారు. ఆర్థికపరమైన ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై చర్యలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాల వారీగా ఈ సంఖ్య, నివేదికలు ఉన్నాయి. వారిపై ఇప్పటికి చర్యలు లేవు. వారిని మళ్లీ విధుల్లోకి తీసుకుంటారా అని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

రాష్ట్రవ్యాప్తంగా గృహనిర్మాణశాఖలో ఆరోపణలు, విచారణ ఎదుర్కొంటున్న వారిపై తదుపరి చర్యలు ముందుకు సాగకుండా ప్రధాన కార్యాలయంలోనే ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారన్న విమర్శలు ఆ శాఖలోనే వ్యక్తం అవుతోంది. నివేదికలు వచ్చాక ప్రభుత్వం ఏ విధంగా నిర్ణయం తీసుకుంటుందనేది తేలనుంది. కాగా ఇప్పటికే తయారుచేసిన జాబితాలో నెల్లూరులో జరిగిన ఇళ్ల నిర్మాణాల కుంభకోణంలో రూ.32 లక్షల అవినీతి తేలిన అధికారిపై చర్యలు పెండింగ్‌లో ఉండగా తిరిగి పోస్టు ఇవ్వాలని అన్నమయ్య జిల్లా అధికారులు నివేదిక పంపినట్టు తెలిసింది. ఇలాంటి అవినీతి చేసిన అధికారులకు మళ్లీ ఉద్యోగా వకాశాలు కల్పిస్తే తిరిగి విచ్చలవిడిగా అక్రమాలకు పాల్పడే అవకాశం ఉంటుందని అంటున్నారు. అలాగే రిటైర్డ్ అయిన వారిని ముఖ్యస్థానాల్లో కూర్చోబెడితే ఇంకా విధుల్లో ఉన్న వాళ్లు వారి కింద ఎలా పని చేస్తామని కొందరు అధికారులు ప్రశ్నిస్తున్నారు. నివేదికలు నిష్పక్షపాతంగా పంపే అవకాశాలు తక్కువని గృహనిర్మాణశాఖ వర్గాలే భావిస్తున్నాయి. దీనిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపడుతుందో వేచి చూడాల్సిందే.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి



బాబు ఏడాది పాలనపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి తదితరులు

రాజంపేట రూరల్: ఎన్నికల సమయంలో ప్రజలకు చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆకేపాటి భవన్‌లో సీఎం చంద్రబాబు ఏడాది పాలనపై పుస్తకాన్ని నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ ప్రజలను నమ్మించి మోసం చేయటం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలను మరోసారి మోసం చేశారని మండిపడ్డారు. ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పిలుపు మేరకు రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ధర్నా కార్యక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. దీంతో దిగివచ్చిన కూటమి ప్రభుత్వం కంటి తుడుపుగా తల్లికి వందనం అమలు చేసిందన్నారు. గతంలో విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకాన్ని ప్రవేశ పెట్టి అమలు చేశారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 80లక్షల మంది విద్యార్థులకు మేలు జరిగిందన్నారు. చంద్రబాబు కేవలం 50లక్షల మందికి మాత్రమే తల్లికి వందనం అందించారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపీ, లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మూరి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు మిరియాల సురేఖ, పాపినేని విశ్వనాథరెడ్డి, జేవీ కృష్ణారావు, ఎస్ జాహీద్‌అలీ, దాసరి పెంచలయ్య, జీవీ సుబ్బరాజు, జబ్బిరెడ్డి వేంకటరెడ్డి, పీ ఖాజామొహద్దీన్, బుర్రు సురేంద్ర యాదవ్, శివారెడ్డి, జుబేద్, కౌన్సిలర్‌లు కూండ్ల రమణారెడ్డి, సనిశెట్టి నవీన్‌కుమార్, కృష్ణాయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తరగతులు తొలగించొద్దు



పాఠశాల బయట నిరసన తెలుపుతున్న తల్లిదండ్రులు, విద్యార్థులు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చిన్నకొత్తపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలలో ఆరు, ఏడు, ఎనిమిది తరగతులను తొలగిస్తే ప్రాణ త్యాగానికైనా సిద్ధమవుతామని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రత్యామ్నాయం 117 జీఓను తీసుకొచ్చి రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక ఉన్నత పాఠశాలల్లో ఉన్న తరగతులను జెడ్పీహెచ్ఎస్‌లో విలీనం చేయడంతో మండల పరిధిలోని చిన్నకొత్తపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆరు, ఏడు, ఎనిమిదవ తరగతులను తొలగించారు. ఈ నేపథ్యంలో సోమవారం పాఠశాల ఎదుట నిరసన తెలుపుతున్న సమయంలో పాఠశాల హెచ్ఎం ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న ఒంటిమిట్ట ఇన్‌చార్జి ఎస్ఐ మహ్మద్ రఫీ నిరసనకారులపై కేసులు నమోదు చేస్తామంటూ బెదిరించారని తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆరోపించారు.

మా పాఠశాల ఎక్కడ.!



హైస్కూల్ ఎదుట నిరసన తెలుపుతున్న యానాది కాలనీవాసులు

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు గాంధీనగర్ ఎస్టీ కాలనీ పాఠశాల ఎక్కడ అంటూ కాలనీవాసులు పెనగలూరు హైస్కూల్‌లో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. గతంలో గాంధీనగర్ ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఒకటో తరగతి నుండి ఐదో తరగతి వరకు నిర్వహిస్తూ ఉండేవారు. హైస్కూల్‌కు మూడు, నాలుగు, ఐదు తరగతులను షిఫ్ట్ చేయడంతో ఇప్పటికే యానాదుల పిల్లలు పాఠశాలకు వెళ్లడం మానేశారు. ఈ ఏడాది హైస్కూల్‌లో తరగతులు లేకుండా కొత్తపల్లి పాఠశాలకు మార్చేశారు. కొత్తపల్లి పాఠశాలకు యానాది కాలనీవాసులు వెళ్లాలంటే దాదాపు ఒకటిన్నర కిలోమీటరు వెళ్లాల్సి ఉంటుంది. తమ పాఠశాలను తమ గ్రామంలోనే ఉంచాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రేషన్ కష్టాలు తొలగించండి

రాజంపేట : అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన మంగంపేట గ్రామంలో బియ్యం కోసం పేదలు నానా కష్టాలు పడుతున్నారు. ఈ మేరకు సోమవారం డీఆర్‌సీసీ సభ్యుడు, రాయలసీమ బూత్ కమిటీ అధ్యక్షుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి పీజీఆర్ఎస్‌లో రాజంపేట సబ్‌కలెక్టరేట్ పరిపాలనాధికారి శ్రీధర్‌కు వినతి పత్రం అందచేశారు. గతంలో ఏ విధంగా రేషన్ పంపిణీ చేసేవారో ఇప్పుడు కూడా అదే విధంగా పంపిణీ జరగాలన్నారు.

మదనపల్లెలో రియల్టర్ దారుణ హత్య

- ఇంట్లోనే బండరాళ్లతో కొట్టి చంపిన వైనం
- గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి తన కళ్లముందే చంపారన్న భార్య
- దర్యాప్తులో భాగంగా మృతుడి భార్యను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 11 ఏళ్లక్రితం జరిగిన తండ్రి హత్యకేసులో మృతుడు నిందితుడు
- ఆధారాలు సేకరించిన క్లూస్‌టీం, ఘటనా స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ మహేంద్ర



గంగాధర మృతదేహం



గంగాధర (ఫైల్ ఫోటో)

మదనపల్లె రూరల్ : పట్టణ శివారుప్రాంతం, బసినికొండ పంచాయతీలో జాతీయరహదారికి ఆనుకుని బైపాస్‌రోడ్డులో ఆదివారం రాత్రి రియల్టర్, వడ్డీ వ్యాపారి నారప్పగారి గంగాధర (37) దారుణహత్యకు గురయ్యాడు. ఇంట్లో నిద్రిస్తుండగా, గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో తన భర్తను కొట్టి చంపినట్లు భార్య వనిత పోలీసులకు ఫోన్ చేసి చెప్పడంతో హత్య విషయం వెలుగులోకి వచ్చింది. అయితే, విచారణలో భాగంగా తాలూకా పోలీసులు మృతుడి భార్య వనితపై అనుమానం వ్యక్తం చేస్తూ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతుడు గంగాధర, 11 ఏళ్ల క్రితం జరిగిన తన తండ్రి కృష్ణమూర్తి హత్యకేసులో ప్రధాన నిందితుడు. పీలేరు రాజీవ్‌నగర్‌కు చెందిన హరిబాబు, ఉషారాణిల కుమార్తె వనితను, మదనపల్లె మండలం బసినికొండకు చెందిన నారాయణమ్మ, కృష్ణమూర్తి కుమారుడు గంగాధరకు ఇచ్చి 13 ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. వీరికి కుమారుడు మోక్షిత్(7), కుమార్తె హిమప్రియ(10) ఉన్నారు. గంగాధర్ మదనపల్లె బైపాస్‌రోడ్డు రామతులసీ కల్యాణమండపం సమీపంలోని నక్కలకుంట వద్ద సొంత ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్నాడు. రియల్ ఎస్టేట్, వడ్డీ వ్యాపారాలు చేస్తున్నాడు. ఆదివారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో ఇంట్లో మద్యం మత్తులో నిద్రిస్తుండగా, గుర్తు తెలియని ఆరుగురు వ్యక్తులు వచ్చి రాళ్లతో కొట్టి చంపేశారు. ఈ సమాచారాన్ని మృతుడి భార్య వనిత రాత్రి 11 గంటల సమయంలో తాలూకా పోలీసులకు ఫోన్‌చేసి తెలిపింది. దీంతో తాలూకా సీఐ కళావెంకటరమణ, ఎస్ఐ చంద్రమోహన్ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని, పరిశీలించారు. మృతుడి ముఖంపై రాళ్లతో కొట్టిన ఆనవాళ్లు, గొంతును తాడుతో బిగించినట్లు గుర్తించారు. ఘటనాస్థలం పరిశీలన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచే హత్యపై ముమ్మర దర్యాప్తు ప్రారంభించారు. అందులో భాగంగా సోమవారం ఉదయం డీఎస్పీ మహేంద్ర ఘటనాస్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది. కుటుంబ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మృతుడి భార్య వనితను హత్య ఘటనపై ప్రశ్నిస్తే...పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అనుమానం వ్యక్తం చేస్తూ అదుపులోకి తీసుకున్నారు. అంతేకాకుండా మృతుడు గంగాధర, రియల్ ఎస్టేట్, వడ్డీవ్యాపారాలు చేస్తున్నందున, ఎవరైనా గిట్టనివారు హత్యకు పాల్పడ్డారా..? ఆర్థిక లావాదేవీలు, వివాహేతర సంబంధమా..? అనే కోణాల్లో దర్యాప్తును ప్రారంభించారు. కాగా, మృతుడు 2014లో అతని తండ్రి కృష్ణమూర్తిని హత్యచేసి చెరువులో పడేసిన ఘటనలో ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ఈ కేసు ఆధారంగా తాలూకా పోలీస్ స్టేషన్‌లో గంగాధరపై రౌడీషీట్ ఉంది. హత్యకేసు విచారణలో శిక్ష పడకపోవడంతో తర్వాత కాలంలో రౌడీషీట్‌ను తీసివేయించుకున్నాడు. గంగాధర నేరచరిత్ర కలిగిన వ్యక్తి కావడం, భార్యపై తరచూ అనుమానం వ్యక్తం చేస్తూ వేధింపులకు పాల్పడేవాడు. వివాహేతర సంబంధం కారణంగా , భార్యతో తరచూ గొడవలు పడేవాడు.. ఈ క్రమంలో గంగాధర హత్యకేసులో మృతుడి భార్యను అదుపులోకి తీసుకోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హత్యకు దారితీసిన పరిస్థితులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు. త్వరలోనే వివరాలు వెల్లడిస్తామన్నారు.

అత్యాచారం కేసులో ఇద్దరికి జీవిత ఖైదు



పోలీసుల అదుపులో ముద్దాయిలు నవీన్‌కుమార్, నరసింహులు

సుండుపల్లె/ రాయచోటి టౌన్ : మహిళపై అత్యాచారం కేసులో ఇద్దరు నిందితులకు జీవిత ఖైదు, రూ.1,01,000 జరిమానా విధిస్తూ కడప 7వ అదనపు జిల్లా జడ్జి జీఎస్ రమేష్‌కుమార్ తీర్పు చెప్పినట్లు సుండుపల్లె ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు తెలిపారు. వివరాలిలా.. పెద్దినేనికాలువ గ్రామానికి చెందిన మహిళ 2022వ సంవత్సరం జూలై నెల 9వ తేదీ అర్ధరాత్రి తన ఇంటిలో నిద్రిస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన దేసూరి నవీన్‌కుమార్, కొవ్వూరి నరసింహులు ఇద్దరు కలిసి మద్యం తాగారు. వారిద్దరు మహిళ ఇంటికి వెళ్లి మళ్లీ మద్యం తాగేందుకు నీళ్లు, గ్లాసులు కావాలని అడిగారు. అందుకు ఆమె తమ వద్ద ఏమీ లేవు అని గట్టిగా చెప్పింది. కొద్దిసేపటి తర్వాత వారిద్దరు మళ్లీ అక్కడికి చేరుకున్నారు. నరసింహులు నోరు మూయగా ప్రవీణ్‌కుమార్ ఆమెను బలవంతంగా ఎత్తుకెళ్లి ఇద్దరు అత్యాచారం చేశారు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో ఇంటి పక్కన చర్చిలో ఉండే అరుణమ్మ, సుధీర్‌రెడ్డి వచ్చి లైట్లు వేయగా ముద్దాయిలిద్దరూ పారిపోయారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ ఎంకే నరసింహుడు కేసు నమోదు చేశారు. రూరల్ సీఐ వరలక్ష్మి, ఎస్ఐ శ్రీనివాసులు చార్జిషీట్ వేశారు. న్యాయవాది యాస్మిన్ బేగం బాధితురాలి తరపున వాదనలు వినిపించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి ముద్దాయిలు ఇద్దరికీ జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన ఇస్రాయిల్

మదనపల్లె రూరల్ : బైక్ అదుపుతప్పి వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన కురుబలకోట మండలంలో జరిగింది. బెంగళూరుకు చెందిన ఇస్రాయిల్(45) కడప వద్ద బంధువుల గ్రామంలో జరుగుతున్న జాతరకు వచ్చాడు. తిరిగి ద్విచక్ర వాహనంలో బెంగళూరు వెళుతుండగా మార్గమధ్యంలోని కురబలకోట మండలం కుక్కరాజుపల్లి వద్ద వాహనం అదుపుతప్పి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో కాలు విరగ్గా గమనించిన స్థానికులు బాధితుడిని మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కుటుంబ సమస్యలతో భార్యాభర్తల ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో భార్యాభర్తలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. మీరుగట్టువారి పల్లెలో నివాసం ఉంటున్న ప్రసాద్(29), లావణ్య(28), భార్యాభర్తలు. ప్రసాద్ పట్టణంలోని ప్రైవేట్ ఎలక్ట్రానిక్స్ దుకాణంలో పనిచేస్తుండగా, లావణ్య ఇంటిపట్టునే ఉంటూ టైలరింగ్ చేస్తోంది. వీరికి ఇద్దరు పిల్లలు. సోమవారం కుటుంబ సమస్యల కారణంగా భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో మనస్థాపం చెందిన ప్రసాద్ విష ద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, అతని భార్య లావణ్య కూడా విష పదార్థం నీటిలో కలుపుకొని తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితులను ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకుంటున్నారు.

తండ్రి మందలించాడని..

తండ్రి మందలించాడని యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మదనపల్లి మండలంలో జరిగింది. వలసపల్లి పంచాయతీ మొలకలదిన్నె క్రాస్‌కు చెందిన సుందరం కుమారుడు నిరంజన్ కుమార్ (25) ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి రావడంతో తండ్రి మందలించాడు. దీంతో మనస్థాపం చెందిన నిరంజన్ కుమార్ సోమవారం ఇంటి వద్ద విష పదార్థం మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆయా ఘటనల్లో సంబంధిత పోలీసులు కేసులు విచారణ చేస్తున్నారు.

ఏడు ఎర్రచందనం దుంగలు స్వాధీనం



నిందితుడు, దుంగలతో అటవీశాఖ అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు అటవీశాఖ పరిధిలోని కేవీ బావి బీటులో కూంబింగ్ నిర్వహిస్తున్న అటవీ శాఖ సిబ్బంది సోమవారం ఏడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కంభం వేములయ్య అనే నిందితుడిని అరెస్టు చేసినట్లు అటవీశాఖ అధికారి శ్యామ్ సుందర్ తెలిపారు.

యువకుడికి తీవ్ర గాయాలు

ములకలచెరువు :..మండలంలోని ఉమాశంకర్ రెడ్డి కాలనీకి చెందిన రాళ్లపల్లె రెడ్డి ముబారక్ (24) బస్టాండ్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వెళుతుండగా వెనుక నుంచి వస్తున్న ప్రైవేటు వాహనం ఢీకొంది. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తొలుత మదనపల్లెకు తర్వాత తిరుపతికి తరలించారు.

జిల్లా కేంద్రం సమగ్రాభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు

రాయచోటి జగదాంబసెంటర్ : అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా ఏర్పడి 4 సంవత్సరాలు అవుతున్నా ఇంత వరకు అభివృద్ధి ఏమీ జరగలేదన్నారు. రాయచోటి నియోజకవర్గం మీదుగా వెళ్లే కడప-బెంగళూరు రైల్వేలైన్‌కు అలైన్‌మెంట్ మార్చారన్నారు. రైతాంగానికి టమాటా పంట ద్వారా తీవ్ర నష్టం వాటిల్లుతోందని టమాటా జ్యూస్ ఆధారిత పరిశ్రమ ఏర్పాటుకు చొరవ చూపాలన్నారు. అనంతరం ఈ నెల 20న జరిగే లక్ష సంతకాల సేకరణ, 23న ఆర్డీఓ కార్యాలయం ఎదుట జరిగే ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ నాయకుడు రామాంజులు, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి విశ్వనాథ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రంగారెడ్డి, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సుమిత్ర, ఎలక్ట్రికల్ అసోసియేషన్ నాయకుడు అస్లాం, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి వెంకటేష్, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథనాయుడు, అహమ్మద్ అలీఖాన్, సురేంద్ర, రియాజ్ పాల్గొన్నారు.

తాత మాటలకు మనస్థాపంతో మనవడి ఆత్మహత్య



మృతి చెందిన వంశీ

బి.కొత్తకోట : ఉమ్మడి కుటుంబంలో పెద్ద అయిన తాత మనవడితో సరదాగా అన్నమాటకు మనస్థాపానికి గురైన మనవడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మండలంలోని బడికాయలపల్లెలో సోమవారం జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ విశ్వనాథరెడ్డి కథనం మేరకు వివరాలు.. బడికాయలపల్లెకు చెందిన మల్లికార్జున కుమారుడు వంశీ (18) ఇంటర్ పూర్తి చేసి ఇంటివద్ద ఉంటున్నాడు. బీటెక్ చేయాలని కలలుగంటూ.. బి.కొత్తకోటలో కంప్యూటర్ విద్య నేర్చుకుంటున్నాడు. వారం క్రితం తాత వెంకటరమణ మనవడితో డబ్బంతా నీ చదువుకే ఖర్చవుతోందని సరదాగా అన్నాడు. దీన్ని మనసులో పెట్టుకుని మథనపడుతున్న వంశీ మానసికంగా ఇబ్బంది పడుతూ వచ్చాడు. సోమవారం తల్లిదండ్రులతో కలిసి వంశీ పొలం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నం 12 గంటలకు బి.కొత్తకోటలో క్లాసుకు వెళ్లాలి అని చెప్పి ఇంటికి వచ్చాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో మెడకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలియని తల్లిదండ్రులు పొలం పనులు చూసుకుని ఇంటికి రాగా లోపల గడియ పెట్టడం గమనించి బిడ్డను పిలిచినా పలకకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. ఎంతసేపటికి తలుపులు తీయకపోవడంతో వాటిని పగులగొట్టి ఇంటిలోకి వెళ్లగా అప్పటికే ఉరివేసుకుని చనిపోయి ఉండటం చూసి తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు. పెద్ద చదువు చదివి గొప్పవాడవు అవుతావనుకుంటే ఇలా చేశావేమయ్యా.. మాకు కడుపుకోత మిగిల్చి పోయావా అంటూ కన్నీంటిపర్యంతం అవుతుంటే స్థానికులు చలించిపోయి ఆవేదన చెందారు. తండ్రి మల్లికార్జున ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

డీపీఆర్ఓ సేవలు మరువలేనివి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



డీపీఆర్ఓ పురుషోత్తంను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్, జేసీ, సబ్ కలెక్టర్లు, డీఐపీఆర్ఓలు

రాయచోటి : బదిలీపై వెళ్తున్న డీపీఆర్ఓ పురుషోత్తం జిల్లాకు చేసిన సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదర్శరాజేంద్రన్‌తో పాటు పలువురు కొనియాడారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో సమాచార శాఖ డీపీఆర్ఓ నంద్యాల జిల్లాకు బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన జిల్లాలో డీపీఆర్ఓ తన విధులను సమర్థవంతంగా నిర్వహించారని ఆయన జిల్లాకు చేసిన సేవలు మరువలేనివని పేర్కొన్నారు. డీపీఆర్ఓ పురుషోత్తం మాట్లాడుతూ డీపీఆర్ఓ, సిబ్బంది, మీడియా మిత్రుల సహకారంతో సమాచార శాఖలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించగలిగానన్నారు. అనంతరం డీపీఆర్ఓ పురుషోత్తంను కలెక్టర్, అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ మధుసూదన్‌రావు, మదనపల్లి, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘస్వరూప్, నైదియాదేవి, సమాచార శాఖ డీఐపీఆర్ఓ భరత్‌కుమార్‌రెడ్డి, ఏపీఆర్ఓ హరినాథ్ నాయక్, జిల్లా అధికారులు, వివిధ మీడియా ప్రతినిధులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దేశం గర్వపడేలా విధులు నిర్వహించాలి

సీఆర్పీఎఫ్ డీఐజీపీ అనుపమ్ శర్మ



శిక్షణలో ప్రతిభ చాటిన జవాన్‌కు మెమెంటో అందజేస్తున్న సీఆర్పీఎఫ్ డీఐజీపీ అనుపమ్ శర్మ

కలికిరి : యావత్ దేశం గర్వపడేలా విధులు నిర్వహించాలని సీఆర్‌పీఎఫ్(సీఐఏటీ–3) నూతన జవాను ప్రమాణ కవాతు కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ డీఐజీపీ బ్రిగేడియన్, ప్రిన్సిపాల్ అనుపమ్ శర్మ అన్నారు. సీఐఏటీ–3 ఆధ్వర్యంలో మొదటి బ్యాచ్‌లో 16 వారాల పాటు శిక్షణ పూర్తి చేసుకున్న 241 మంది జవాన్‌లకు నూతన సీఆర్‌పీఎఫ్ జవాన్ కవాతు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ జవాన్‌లు ధరించే యూనిఫాం కేవలం దుస్తులు కాదని ధైర్యం, నిస్వార్థ సేవ, సహచరులు, దేశ ప్రజలతో విడదీయరాని బంధానికి చిహ్నమన్నారు. సేవకు అంకితమైన జవాన్‌లు దేశ సంక్షోభ సమయంలో భద్రతా భావాన్ని, విశ్వాసాన్ని కలిగించేలా పనిచేయాలన్నారు. శిక్షణలో ఆల్‌రౌండ్ ప్రతిభ చాటిన కానిస్టేబుల్ మిథిలేష్ కుమార్‌ను అభినందించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ కమాండెంట్, శిక్షణాధికారి నీరజ్‌కుమార్ పాండే, కమాండెంట్ రాజేష్ కుమార్, అధికారులు, ఐటీబీపీ, బీఎస్ఎఫ్, సైనిక పాఠశాల, జేఎస్టీయూ, ఢిల్లీ పబ్లిక్ పాఠశాల నుంచి అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భర్త మందలించాడని ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న చిన్నమ్మి

కలకడ : భర్త మందలించాడని మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి భార్య ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ అబ్దుల్ ముజీబ్ తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కలకడ మండలం బాలయ్యగారిపల్లె పంచాయతీ, తూర్పువడ్డిపల్లెకు చెందిన వెంకటరమణ తన భార్య దేరంగుల చిన్నమ్మి (60) తనకు సమయానికి అన్నం పెట్టడం లేదని 13వతేదీన మందలించాడు. దీంతో మనస్థాపానికి గురైన ఆమె ఇంట్లో భర్త లేని సమయంలో పురుగుల మందు తాగింది. చుట్టుపక్కల వారు గమనించి భర్తకు సమాచారం అందజేశారు. వెంటనే తిరుపతి ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు భర్త వెంకటరమణపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది

గాలివీడు : గాలివీడు మండలం గోరాన్ చెరువు గ్రామం ఎస్టీ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా వర్నెల సుబ్బమ్మ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. బాధితురాలి కథనం మేరకు.. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఉన్న టీవీ పేలి పెద్ద శబ్దం రావడంతో ఇళ్లంతా ఒక్కసారిగా దట్టమైన పొగలతో కూడిన మంటలు కమ్ముకున్నాయి. వెంటనే స్థానికులు అగ్నిమాపకశాఖ వారికి సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. ఈ ఘటనలో అదృష్ట వశాత్తు ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఇంట్లో ఉన్న రూ.20 వేల నగదు, దుస్తులు, బియ్యం, టీవీ, బీరువా పూర్తిగా కాలిపోయాయి. దాదాపు లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు.

కరెంట్ షాక్‌తో యువకుడికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన యువకుడు

మదనపల్లె రూరల్ : కరెంట్ షాక్‌తో యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన రామసముద్రం మండలంలో జరిగింది. చెంబకూరు పంచాయతీ నారేవారిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు భాస్కర (28), పొలం వద్ద టమాటా పంట కోసి, క్రేట్లలో వేసి వాహనంలో పెట్టేందుకు తీసుకు వెళుతుండగా, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు శరీరానికి తగిలి కరెంట్ షాక్‌కు గురయ్యాడు. ప్రమాదంలో భాస్కర తీవ్రంగా గాయపడగా, గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బాధితుని బెంగళూరుకు తీసుకువెళ్లారు.

న్యాయం కోసం భర్త ఇంటిముందు నిరసన



భర్త మహేశ్వర్ రెడ్డి ఇంటి ముందు నిరసన తెలుపుతున్న సౌజన్య, ఆమె కుటుంబ సభ్యులు

వీరబల్లి : వీరబల్లి మండలం, మట్లి గ్రామం, బత్తినవాండ్లపల్లిలో భర్త మహేశ్వర్ రెడ్డి ఇంటి ముందు భార్య సౌజన్య తన బిడ్డ, కుటుంబ సభ్యులతో కలిసి నిరసనకు దిగింది. ఆమె రాకతో ఇంటికి తాళాలు వేసి మహేశ్వర్ రెడ్డి, అతని తల్లిదండ్రులు పరారయ్యారు. వివరాలిలా.. లక్కిరెడ్డిపల్లి మండలం కస్తూరాజుగారిపల్లె గ్రామం చాగలగుట్టపల్లికి చెందిన సౌజన్య హైదరాబాదులో ఉండగా మహేశ్వర్‌రెడ్డి పరిచయమయ్యాడు. వీరు ఎనిమిదేళ్లుగా ప్రేమించుకొని రెండు సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నారు. వీరికి పది నెలల బాబు ఉన్నాడు. ఈ నేపథ్యంలో గత రెండు రోజులుగా ఆమె భర్త ఇంటి ముందు నిరసన తెలుపుతోంది. ఆమె ఫిర్యాదు మేరకు మహేశ్వర్ రెడ్డిపై కేసు నమోదు చేశారు.

విద్యార్థులూ.. బస్సు పాసులు పొందండిలా..!



ఆర్టీసీ-1డిపోలో బస్సు పాసుల కౌంటర్

మదనపల్లె సిటీ : పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు బస్సు పాసుల జారీకి ఆర్టీసీ డిపో అధికారులు చర్యలు చేపట్టారు. మదనపల్లె ఆర్టీసీ డిపో పరిధిలోని వన్, టు డిపోలలో ఉన్న బస్సు పాస్ కౌంటర్ వద్ద ఉచిత, రాయితీ బస్సు పాసులు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. విద్యార్థులు ఇక్కడి కౌంటర్‌లో దరఖాస్తు ఫారాలు తీసుకుని పూర్తి చేసి, నిర్ణీత పత్రాలు జతచేసి కౌంటర్‌లోని సిబ్బందికి అందజేసి పాసులు పొందవచ్చు. ఆన్‌లైన్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకుని పాసులు తీసుకోవచ్చని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బస్‌పాసు దరఖాస్తుల ఆధునీకరణ ప్రక్రియ జరుగుతోంది. సోమవారం నుంచి యథావిధిగా కొత్త పాసులు విద్యార్థులకు జారీ చేస్తున్నారు. ఏమైనా సందేహాలు ఉంటే ఇక్కడి కౌంటర్ వద్ద సిబ్బందిని సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చు. ఆర్టీసీ కల్పిస్తున్న ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.

వీరికి ఉచితం..

ఏడో తరగతి వరకు చదివే 12 ఏళ్లలోపు బాలురు, పదో తరగతి వరకు చదివే 18 ఏళ్లలోపు బాలికలు మాత్రమే ఉచిత పాసులు తీసుకునేందుకు అర్హులు. విద్యార్థి ఇంటి నుంచి పాఠశాలకు 20 కిలో మీటర్ల లోపు దూరం ఉంటేనే ఉచిత బస్సు పాసు జారీ చేస్తారు. ఇవి వచ్చే ఏడాది ఏప్రిల్ నెలాఖరు వరకు చెల్లుబాటు అవుతాయి. ఈ పాసుల కోసం దరఖాస్తు ఫారంపై పాస్‌పోర్టుసైజు ఫొటోలు అంటించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడి సంతకంతో పాటు స్టాంపు వేయించాలి. పూర్తి చేసిన దరఖాస్తుకు ఒరిజినల్ ప్రస్తుత స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు నకలు జత చేసి స్థానిక ఆర్టీసీ పాసుల కౌంటర్ వద్ద అందజేస్తే పాస్ ఇస్తారు. దరఖాస్తు సమర్పించే సమయంలో రూ.50 చెల్లిస్తే సరిపోతుంది. ఇవి కూడా కేవలం పాసు నామినేషన్ ఐడీ కార్డు నిమిత్తమే తీసుకుంటారు.

రాయితీతో చెల్లింపు పాసు..

ఒక నెల, మూడు నెలలు, సంవత్సర కాల వ్యవధికి చెల్లుబాటయ్యేలా విద్యార్థులకు 33 శాతం రాయితీతో చెల్లింపు పాసులు (స్టూడెంట్ పెయిడ్ పాసులు) కూడా ఆర్టీసీ జారీ చేస్తుంది. వీటి కోసం పాఠశాల, కళాశాల విద్యార్థులు ఎవరైనా చదివే పాఠశాల, కళాశాల మధ్య దూరం 50 కిలో మీటర్ల లోపు ఉంటేనే ఈ పాసులు జారీ చేస్తారు. ఇంటి నుంచి విద్యా సంస్థకు మధ్య ఉన్న దూరం, కాలవ్యవధిని అనుసరించి రాయితీ స్టూడెంట్ పెయిడ్ పాసుల ధర ఉంటుంది. దరఖాస్తు ఫారంలో పైన ఒక పాస్‌పోర్టు సైజు ఫొటో, కింద ఉండే బోనఫైడ్ సర్టిఫికెట్‌పై ఒక ఫోటో అంటించి వాటిపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లేదా కాలేజీ ప్రిన్సిపాల్ సంతకంతో పాటు స్టాంపు వేయించాలి. పూర్తి చేసిన దరఖాస్తుకు ప్రస్తుతం ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్, పదోతరగతి మార్కుల జాబితా నకలు, ఆధార్‌కార్డు నకలు జత చేసి సమర్పించాలి. మొదటిసారి ఏ కాల పరిమితితో పాసు తీసుకున్నారో తర్వాత రెన్యువల్ పాస్ కూడా అదే కాలపరిమితికి జారీ చేస్తారు.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి..



విద్యార్థులు బస్ పాస్‌లను సద్వినియోగం చేసుకోవాలి. డిపోలో ప్రత్యేక కౌంటర్‌లో పాసులు జారీ చేస్తున్నాం. దరఖాస్తులు పూర్తి చేసి అందజేస్తే పాసులు అందిస్తాం. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్టూడెంట్ బస్సులు నడుపుతున్నాం.

-మూరే వెంకట రమణారెడ్డి, ఆర్టీసీ-1డిపో మేనేజర్